డబ్బే ముఖ్యం.. ప్రాణాలు కాదు

- ప్రభుత్వ స్థలంలో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- భారీ టిప్పర్లలో తరలింపు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

సంగం మండలం పెరమన వద్ద టిప్పర్ ఢీకొని ఏడుగురు మృతిచెందినా కూటమి నేతల్లో, జిల్లా అధికారుల్లో ఎలాంటి మార్పు రావడం లేదు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని ఓ ప్రభుత్వ స్థలంలో పట్టపగలే టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నా.. పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. భారీ లోడ్‌లో మితిమీరిన వేగంతో టిప్పర్లు రాకపోకలు సాగించడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు.




అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లు

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలోని 24వ డివిజన్ కల్లూరుపల్లిలోని ఓ ప్రభుత్వ స్థలంలో గురువారం యథేచ్ఛగా మట్టి తవ్వకాలు ప్రారంభించారు. కల్లూరుపల్లిలోని 3.5 ఎకరాల ప్రభుత్వ స్థలంపై స్థానిక టీడీపీ నాయకుల కళ్లు పడ్డాయి. ఆ స్థలంలో మట్టి పుష్కలంగా ఉండడంతో తవ్వకాలు ప్రారంభించారు. ఐదు టిప్పర్‌లు, రెండు జేసీబీలతో గురువారం తెల్లవారుజామున నుంచి తవ్వకాలు జరుగుతున్నాయి. ఆ ప్రాంతానికి సమీపంలో ఎవరూ లేకపోవడంతో వారిని అడిగేవారు లేరనట్లు తవ్వకాలు చేశారు.

కాపలా ఉంచి మరీ..

లేఅవుట్‌లో తవ్వకాలు జరుపుతున్న సమయంలో పదుల సంఖ్యలో టీడీపీ నేతలు మనుషులను కాపలాగా ఉంచారు. ఎవరైనా వచ్చినా అడ్డుకునేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు. గంటల వ్యవధిలోనే 15 టిప్పర్‌లు మట్టిని తరలించారు. ఆయా టిప్పర్‌లు మట్టి లోడ్‌తో స్పీడ్‌గా వెళ్లడంతో ఆ ప్రాంతంలోని ప్రజలను ఆందోళనకు గురిచేసింది. టిప్పర్ వల్ల ఘోర రోడ్డు ప్రమాదం జరిగిన పక్కరోజే టీడీపీ నేతలు తమ ఆగడాలను ప్రారంభించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.25 లక్షలకు బేరం

ఓ లేఅవుట్‌ను లెవెల్ చేసే నిమిత్తం మట్టిని తరలించేందుకు స్థానిక టీడీపీ నేత రూ.25 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. మట్టి తవ్వకాలు జరుపుతున్న స్థలానికి మూడు కిలోమీటర్ల దూరంలోనే లేఅవుట్ ఉండడంతో టిప్పర్‌లతో మట్టిని తరలిస్తున్నారు.

అధికారులు స్పందించాలి



ప్రభుత్వ స్థలంలో ఎటువంటి అనుమతుల్లేకుండా అక్రమంగా మట్టిని తరలించడం దారుణం. ప్రభుత్వ వనరులను కొందరు వ్యక్తులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి తవ్వకాలు చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– ఉడతా మురళీయాదవ్, 24వ డివిజన్ వైఎస్సార్‌సీపీ నేత



ప్రభుత్వ లేఅవుట్‌లో కొందరు వ్యక్తులు దగ్గరుండి జరిపిస్తున్న మట్టి తవ్వకాలు



మట్టిని తవ్వుతున్న జేసీబీ

ఎస్జీఎఫ్ క్రీడా పోటీల ఎంపికలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ

నెల్లూరు (టౌన్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) అండర్–14, అండర్–17 ఎంపికలు గురువారం నిర్వహించారు. స్థానిక స్టోన్‌హౌస్‌పేటలోని ఆర్‌ఎస్సార్ హైస్కూల్‌లో ఎంఈఓ తిరుపాల్, హెచ్‌ఎం మధుసూదనరావు ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. కబడ్డీ, వాలీబాల్‌లకు సంబంధించి అండర్–14 అండర్–17 బాలుర విభాగంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేశారు. కాగా వర్షం కారణంగా బాలికల ఎంపికలను శుక్రవారానికి వాయిదా వేశారు. చెస్ పోటీలకు సంబంధించిన ఎంపికలు చేశారు. ఎస్జీఎఫ్ కో–ఆర్డినేటర్ హరి పాల్గొన్నారు.

పోషణ్ మాసోత్సవాలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రత్నమ్మ మాట్లాడుతూ అక్టోబర్ 16వ తేదీ వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఏఎన్‌ఎం సౌందర్య, అంగన్‌వాడీ వర్కర్స్ చెంచులు, మమత, హసీనా, ఆశా వర్కర్ లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..




కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న మురళీకృష్ణ, రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు

నెల్లూరురూరల్: కలెక్టర్ హిమాన్షు శుక్లాను ఆయన కార్యాలయంలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ ఉల్లిపాయ మురళీకృష్ణ యాదవ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో సంక్షేమ హాస్టల్స్ పనితీరుపై ఎస్సీ ఎస్టీ కేసులు పురోగతి తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు.

⇨ కలెక్టర్ హిమాన్షు శుక్లాను ఆయన చాంబర్‌లో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి, జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేష్, ఆనంద్, కృష్ణప్రసాద్, డానియల్ పీటర్‌రావు, హేమంత్‌కుమార్, బాలకోటమ్మ, రమాదేవి, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

రూ.30 లక్షల పరిహారమివ్వాలి



మృతులకు నివాళులర్పిస్తున్న నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సంగం మండలం పెరమన వద్ద ఇసుక టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ.30 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. గుర్రాల మడుగు సంఘంలో వెంగయ్య, సారమ్మ మృతదేహాలను ఆయన గురువారం సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక తవ్వకాలపై నిషేధం ఉన్నా అధికార పార్టీ నాయకుల అండదండలతో యథేచ్ఛగా ఇసుక రవాణా జరుగుతోందని, దీనివల్ల ఇలాంటి ప్రమాదం జరిగిందన్నారు. నాయకులు నరేష్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి సంపాదనతోనే ప్రమాదాలు

అవినీతి సంపాదన కోసం కొందరు అక్రమార్కులు ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్రసాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే రూ.10 లక్షల నష్ట పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు.

⇨ **నెల్లూరు(బృందావనం):** పెరమన రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని ప్రజాసత్తా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పులగర శోభన్‌బాబు గురువారం డిమాండ్ చేశారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.

గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ



మాట్లాడుతున్న సునీల్‌కుమార్

నెల్లూరు(అర్బన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో దీనదయాళ్ ఉపాధ్యాయ–గ్రామీణ కౌసల్య యోజన పథకం ద్వారా సీడాప్, థ్రెడ్స్–ఐటీ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో గ్రామీణ నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తామని సంస్థ నేత కె.సునీల్‌కుమార్ తెలిపారు. ఈమేరకు పాత జెడ్పీ కార్యాలయ సమీపంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శిక్షణా సమయంలో హాస్టల్, భోజనం, యూనిఫామ్ కూడా ఉచితంగా కల్పిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఇండస్ట్రీయల్ సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువత తమ సర్టిఫికెట్‌లతో పాటు రేషన్ కార్డు, ఆధార్ కార్డు కాపీలను కొత్తూరు రోడ్డులోని కేఎస్ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఉన్న థ్రెడ్స్–ఐటీ కార్యాలయంలో అందజేయాలని కోరారు. పూర్తి వివరాలకు 98661 11223 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నిత్యావసర సామగ్రి వితరణ



నెల్లూరు(బృందావనం): తిక్కన మహాకవి లలిత కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు ఆలూరు శిరోమణి శర్మ దంపతులచే 37 మంది బ్రాహ్మణులకు నిత్యావసర సామగ్రిని గురువారం వితరణ చేశారు. నెల్లూరు, కోవూరు, గూడూరు ప్రాంతాలకు చెందిన బ్రాహ్మణులకు అందజేసినట్లు గురువారం తెలిపారు.

పాఠశాలలో సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న నాగార్జున

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 13వ డివిజన్ బలిజపాళెం పాఠశాలను స్థానిక కార్పొరేటర్, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఊటుకూరు నాగార్జున గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను హెచ్‌ఎం ప్లాస్మా ఆయన దృష్టికి తీసుకొచ్చారు. భారీ వాహనాలు రాకుండా, యాక్సిడెంట్లు జరగకుండా చూడాలని ఆమె కోరారు. అనంతరం ఆయన విద్యార్థులతో ముచ్చటించారు.

‘రంగడి’ సన్నిధిలో చిత్రకూట ఉత్సవం నేడు

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు స్వామివారికి చిత్రకూట ఉత్సవం జరుగనుందని ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

క్రిస్టియన్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

నెల్లూరు(బృందావనం): రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ల పదవులను వెంటనే భర్తీ చేయాలని ఆలిండియా పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ రాజశేఖర్ దాసరి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయకపోవడంతో తమకు అన్యాయం జరుగుతోందన్నారు.

ఫిర్యాదులపై కమిషనర్ పరిశీలన



గుడిపల్లిపాడులో అనధికార నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదులపై నగర కమిషనర్ నందన్ గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. తొలుత గుడిపల్లిపాడులో కమ్యూనిటీ హాల్‌ను అధికారులతో కలిసి పరిశీలించి, శాశ్వత పరిష్కారం అందించాలన్నారు. అదే ప్రాంతంలోని సాయి బృందావనం లేఅవుట్‌ను పరిశీలించారు. అనుమతుల్లేని నిర్మాణాలను వెంటనే ఆపివేయాలన్నారు. రెండో డివిజన్ సిరి గార్డెన్స్ ప్రాంతంలో కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత క్రమం తప్పకుండా చేపట్టాలని సూచించారు. స్టోన్‌హౌస్‌పేటలో కేవీసీ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద దుకాణాలను తనిఖీ చేశారు. నిర్వాహకులు అద్దె బకాయిలను సకాలంలో చెల్లించాలని, లేకుంటే జప్తు చేసుకుంటామని హెచ్చరించారు. వేదయపాళెంలో సప్తగిరి లేఅవుట్‌కు సంబంధించిన ఫిర్యాదుపై పరిశీలించి, పలు సూచనలు చేశారు. అపరిశుభ్ర వాతావరణంలో నిర్వహిస్తున్న హోటల్ ప్రాంగణాన్ని పరిశీలించి రూ.5 వేల జరిమానా విధించారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేయకుండా అడ్డుకోవాలని సూచించారు. ఆయన వెంట వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదేళ్లుగా అద్దె చెల్లించని షాపు సీజ్



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థకు అద్దె చెల్లించని మున్సిపల్ దుకాణాన్ని రెవెన్యూ అధికారులు గురువారం సీజ్ చేశారు. ట్రైకసరోడ్డులోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్‌లో ఒకటో నంబర్ షాపునకు సంబంధించి సదరు యజమాని 2020 జనవరి నుంచి 2025 జూలై వరకు రూ.15,05,892 అద్దె చెల్లించాల్సి ఉంది. పలుమార్లు నోటీసులు జారీ చేసినా ప్రయోజనం లేకపోవడంతో కమిషనర్ నందన్ ఆదేశాల మేరకు సదరు షాపును సీజ్ చేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు ఉదయ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో సీజనల్ వ్యాధులకు చెక్

నెల్లూరు(అర్బన్): మలేరియా, డెంగీ, చికున్ గున్యా, ఫ్లూ తదితర వ్యాధుల పట్ల అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా చెక్ పెట్టవచ్చని మెడికవర్ హాస్పిటల్ సీనియర్ జనరల్ మెడిసిన్ స్పెషలిస్టు, డయాబెటాలజిస్ట్ పి.విజయకుమార్ తెలిపారు. ఆయన నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్షాకాలం, శీతాకాలంలో ఎక్కువగా ఫ్లూ(జలుబు సంబంధిత) కేసులు వస్తాయన్నారు. వాటితో పాటు దగ్గు, గొంతునొప్పి, జ్వరం, శరీర నొప్పులు ప్రధాన లక్షణాలుగా ఉంటాయన్నారు. శీతాకాలంలో టైఫాయిడ్ కూడా ఎక్కువగా వస్తుందన్నారు. ఎక్కువ రోజులు జ్వరం, తలనొప్పి, కడుపునొప్పి టైఫాయిడ్‌కు ప్రధాన లక్షణాలన్నారు. ఇలాంటి జబ్బులను నివారించుకోవాలంటే తాగునీటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మలేరియా, డెంగీ నివారణకు దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు తగినంత నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ లాంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రత, రక్షిత తాగునీటితో సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చన్నారు. సీజనల్ వ్యాధులకు మెడికవర్‌లో నాణ్యమైన వైద్యం అందిస్తామన్నారు.

ఆదుకోవాలని వినతి



డీఎంహెచ్‌ఓ సుజాతకు వినతి పత్రం ఇస్తున్న అసోసియేషన్ నేతలు

నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్యారోగ్యశాఖలో పనిచేస్తూ గత నెలలో ప్రమాదవశాత్తు హెల్త్ అసిస్టెంట్ నక్కా రామ్‌కుమార్ మృతిచెందారని, వారి కుటుంబంలో ఒకరికి త్వరగా కారుణ్య నియామకం కల్పించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు కోరారు. ఈ మేరకు మృతుని భార్య, బిడ్డలతో కలిసి సుధాకర్‌రావు గురువారం సంతపేటలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ సుజాత, ఏఓ నిశాంత్‌రెడ్డిలకు వినతి పత్రం ఇచ్చారు. ఆ కుటుంబానికి ప్రభుత్వపరంగా రావాల్సిన ప్రయోజనాలు త్వరగా అందేలా చూడటంతో పాటు కుటుంబసభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. సంఘ నగరాధ్యక్షుడు గౌస్‌బాషా, ఉపాధ్యక్షుడు నాగరాజు, జాయింట్ సెక్రటరీ మహేష్, మృతుని కుటుంబ సభ్యులు ప్రసూన, షణ్ముఖి, ఈశ్వర్ కార్తికేయ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భారీ రక్తదాన శిబిరం



నెల్లూరురూరల్: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా స్టోన్‌హౌస్‌పేట బీవీఎస్ బాలికల హైస్కూల్ దగ్గర బీజేపీ నాయకులు గురువారం భారీ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 84 మంది రక్తదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి, అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

⇨ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ ఆధ్వర్యంలో చిన్నబజార్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హేమంత్, పెంచలయ్య, బాలాజీ, సాయికుమార్, అభి, రాజు, మధు, సత్య, సుందరం, మంజునాథ్ పాల్గొన్నారు.

రోడ్డు పనులను వేగవంతం చేయండి



నెల్లూరు(బారకాసు): రామలింగాపురం అండర్ బ్రిడ్జి ప్రాంతంలో రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ నందన్ అధికారులకు సూచించారు. స్థానిక రామలింగాపురం అండర్ బ్రిడ్జి ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులను నిర్దేశించిన సమయంలోపు నాణ్యతతో పూర్తిచేసి ప్రజల రాకపోకలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి తిరునక్షత్ర మహోత్సవాలు

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేట గోపురంవీధిలోని వేదాంత దేశికర్ దేవస్థానంలో శుక్రవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు యతీంద్ర మహా దేశికన్ తిరునక్షత్ర మహోత్సవాలు ఉంటాయని దేవస్థానం మేనేజింగ్ ట్రస్టీ కె.వరదరాజన్ గురువారం తెలిపారు. భక్తులు పాల్గొని, మహాదేశికన్ వారిని దర్శించుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి డిమాండ్



నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ జేఏసీ రాష్ట్ర నాయకుడు అల్తాఫ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం విద్యుత్ భవన్ వద్ద నాలుగో రోజు గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. నాయకులు దామోదర్, శ్రీనివాసులు, నజీర్‌ఖాన్, వెంకటేశ్వర్లు, రఫీ, నవాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు నిల్వ లేకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎస్ఈ రామ్మోహన్‌రావు

నెల్లూరు(బారకాసు): మేజర్ డ్రెయిన్స్‌లో మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ ఎస్ఈ రామ్మోహన్‌రావు సంబంధిత ఇంజినీర్లను ఆదేశించారు. ఇంజినీరింగ్ విభాగపు వారాంతపు సమీక్షను ఎన్‌ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ నగరంలోని ప్రధాన మార్గాల్లో స్పీడు బ్రేకర్లను గుర్తించి వాటికి పెయింటింగ్ వర్క్ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే అపార్ట్‌మెంట్లలో తాగునీటి కొళాయి కనెక్షన్ల వివరాలు, వాటికి వాటర్ సప్లయ్ ఏ విధంగా జరుగుతుంది తదితరాలను పర్యవేక్షించి నివేదికలు సమర్పించాలన్నారు. నగరంలో తాగునీటి కొళాయి బకాయిదారులను గుర్తించి, నవంబర్ 10లోపు నోటీసులు జారీ అయ్యేలా పర్యవేక్షించాలన్నారు. ఈఈలు శేషగిరిరావు, రహంతు జానీ, డీఈఈలు ముజాహిద్దీన్, ప్రసాద్, రఘు, అసిస్టెంట్ డైరెక్టర్ హార్టికల్చర్ నరసింహారావు, అసిస్టెంట్ ఇంజినీర్లు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణలో ‘ఫార్మకోవిజిలెన్స్’



నెల్లూరు(అర్బన్): నగరంలోని నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో జాతీయ ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ శ్రీనివాసులురెడ్డి, ఆస్పత్రి అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ మల్లి నిర్మల మాట్లాడారు. డాక్టర్ ప్రమేయం లేకుండా మందులు వాడితే దుష్ప్రభావాలు కలుగుతాయన్నారు. ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ మాధవులు, డాక్టర్ కృష్ణచైతన్య, జూనియర్ వైద్యులు, పోస్టు గ్రాడ్యుయేట్లు పాల్గొన్నారు.

నగరంలో మోస్తరు వర్షం



నెల్లూరు(అర్బన్): నగరంలోని గురువారం మోస్తరు వర్షం కురిసింది. వెంకటేశ్వరపురం నుంచి బుజబుజ నెల్లూరు, పొదలకూరు రోడ్డు, బీవీనగర్, ఆర్టీసీ కాలనీ, దర్గామిట్ట, మాగుంట లేఅవుట్ తదితర పలు ప్రాంతాల్లో రెండు గంటలసేపు వర్షాలు కురిశాయి. దీంతో గాంధీబొమ్మ, పొగతోట, రాయాజీ వీధి తదితర ప్రాంతాల్లో సైడు కాలువలు మురుగుతో కలిసి పొంగి ప్రవహించాయి. ఆత్మకూరు బస్టాండ్, మాగుంట లేఅవుట్ అండర్‌బ్రిడ్జి, శోధన్ నగర్ అండర్ బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున నీరు చేరింది. పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు ఏఆర్ ఏఎస్పీ బదిలీ

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఏఆర్ ఏఎస్పీ జి.మునిరాజాను పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. అయితే సుమారు మూడునెలల కిందటే ఆయన్ను పోలీసు ఉన్నతాధికారులు పోలీస్ హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేశారు. ఆయన లేడీడాన్ అరుణతో జరిపిన సంభాషణ ఆడియో ఇటీవల వైరల్ అయిన విషయం విధితమే. ఈ నేపథ్యంలోనే ఆయన బదిలీ జరిగిందన్న ప్రచారం సాగుతోంది.